క్లుప్తంగా

ఉండవల్లి పొలాల పరిశీలన



తాడేపల్లిరూరల్: ఉండవల్లి కొండవీటి వాగు, కృష్ణానది వరద వల్ల నీట మునిగిన పంట పొలాలను గుంటూరు ఆర్డీఓ శ్రీకర్ వ్యవసాయశాఖ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం రాజధాని రైతు సంఘం కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెం తదితర ప్రాంతాల్లో కొండవీటి వాగు వల్ల జరిగిన నష్టాన్ని ఆర్డీఓకు వివరించారు. బాధితులకు న్యాయం జరుగుతుందని ఆర్డీఓ శ్రీకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డీడీ బి.రవీంద్ర రైతు భరోసా కేంద్ర ఇన్‌చార్జి సంగీత, రైతులు కోటిరెడ్డి, రఘునాథ రెడ్డి, శింగంశెట్టి మణి, షేక్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



తాడేపల్లిరూరల్ : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి దుగ్గిరాల మండలం, ఉండవల్లిలోని ఆ పార్టీ నాయకులు గురువారం నివాళి అర్పించారు. సీపీఎం నాయకులు, రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు, సీపీఎం జిల్లా నాయకులు ఈమని అప్పారావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వై.స్టాలిన్, వై.బ్రహ్మేశ్వరరావు, నాగ మల్లేశ్వరరావు, ఎం.నరసింహారావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.భాస్కరయ్య, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాజధాని డివిజన్ నాయకులు ఈమని రామారావు, సి.హెచ్.సుందరరావు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

టూ టౌన్ సీఐగా నిస్సార్‌బాషా



తెనాలిరూరల్: తెనాలి టూ టౌన్ సీఐగా నియమితులైన ఎండీ నిస్సార్ బాషా గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ సీఐగా పనిచేసిన సుధాకర్ ఇటీవల సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న నిస్సార్ బాషా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెనాలి టూ టౌన్ సీఐగా నియమితులై ఉదయం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని శావల్యాపురం, తెనాలి వన్‌టౌన్, నాగార్జునసాగర్, నర్సరావుపేట స్టేషన్లలో ఎస్ఐగా తాను విధులు నిర్వహించినట్టు తెలిపారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది సీఐడీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లో పని చేయడంతో పాటు గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ విభాగంలో, ప్రత్తిపాడులో సేవలందించినట్లు చెప్పారు. తెనాలిలో ప్రధాన సమస్యల పరిష్కారంతో పాటు ఉన్నతాధికారుల ఆదేశానుసారం శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.

రేపు పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

తెనాలిఅర్బన్: పద్మశాలి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తృతీయ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు జీవి.శివరామకృష్ణ, కె.వి.వి. సత్యనారాయణలు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని చెప్పారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీలు పి.అనురాధ, ఎం.హనుమంతరావు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్.రామకృష్ణ, ఐఆర్ఎస్ అధికారిణి వి.కోటేశ్వరి పాల్గొంటారని చెప్పారు. సభ్యులందరూ పాల్గొనాలని కోరారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

వరద బాధితులకు తెనాలి సబ్‌కలెక్టర్ సంజన సింహా భరోసా



మహానాడు వరద బాధితులతో మాట్లాడుతున్న తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా

తాడేపల్లిరూరల్ : మహానాడులోని వరద ప్రభావిత ప్రాంతంలోని ప్రజలు అధైర్యపడవద్దని, నష్టం జరిగిన ప్రతి ఒక్కరినీ గుర్తించి ప్రభుత్వం ఆదుకుంటుందని తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహా చెప్పారు. గురువారం కేంద్ర బృందంతో, కలెక్టర్ నాగలక్ష్మితో కలిసి పర్యటించిన అనంతరం వివిధ శాఖ అధికారులు, వరద బాధితులతో సమావేశమైన సంజన సింహా ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా మహానాడు 20, 21 రోడ్లలో ఎవరికీ రేషన్ అందలేదని ప్రజలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో అందరికీ అందిస్తామని తహసీల్దార్ డి.సీతారామయ్య చెప్పారు. అనంతరం సంజన సింహా మాట్లాడుతూ 650 మందికి ప్రభుత్వం రేషన్ అందజేసిందని, తక్కువగా రావడంతో అందరికీ అందలేదని, రెండురోజుల్లో అందిస్తామని చెప్పారు. నష్టపరిహారం గురించి అందరి పేర్లూ నమోదు చేస్తామని మహిళలు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

ప్రతిఒక్కరికీ నష్టపరిహారం

ప్రభుత్వ ఉన్నతాధికారులు వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్ బుధవారం సాయంత్రం నుంచి పనిచేస్తోందని, ఈ ప్రాంతంలో మొత్తం 3,500కుపైగా నివాసాలు ఉన్నాయని, కరకట్ట చివరి భాగం నుంచి 64 మంది సిబ్బందితో కూడిన 32 బృందాలు నష్ట వివరాలు సేకరిస్తున్నాయని సబ్ కలెక్టర్ చెప్పారు. శుక్రవారం సాయంత్రానికల్లా యాప్ ద్వారా నష్టపరిహార జాబితాను ఉన్నతాధికారులకు అందిస్తామని, నష్టపోయిన ప్రతిఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఎలక్ట్రికల్ వస్తువులకు ఫ్రీ సర్వీస్ అందించాలని, ఏవైనా స్పేర్ పార్ట్స్‌కు 50 శాతం రాయితీ కల్పించాలని ఆదేశాలు జారీ చేశారని సంజన సిహా చెప్పారు. ఈ సందర్భంగా శ్యామ్ అనే వ్యక్తి తమ ఇంట్లో పాడైన ఫ్రిజ్ సర్వీసుకు ఎల్‌జీ షోరూం వారు తిరస్కరించారని వివరించారు. దీనికి స్పందించిన సబ్‌కలెక్టర్ త్వరలో సర్వీసు అందించేలా కృషి చేస్తామని వివరించారు. మహానాడు వైపు కృష్ణానదికి రిటైనింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేయడంతో ఆమె సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే ఈ విషయాన్ని కలెక్టర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీకర్, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, అడిషనల్ కమిషనర్ శ్రీధర్, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

కంతేరులో అసైన్డ్ భూమికి తప్పుడు రిజిస్ట్రేషన్

- నకిలీ పత్రాలతో గురజాలలో రిజిస్ట్రేషన్ చేసి ఇంటి పన్ను కోసం దరఖాస్తు
- కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



తహసీల్దార్ జారీచేసిన ఎండార్స్‌మెంట్ సర్టిఫికెట్

తాడికొండ: అసైన్డ్ భూమికి తప్పుడు సర్వే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసి ఇంటిపన్ను కోసం దరఖాస్తు చేసిన ఘటన తాడికొండ మండల కంతేరు గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తాడికొండ మండలం కంతేరు గ్రామానికి చెందిన కర్రి మరియమ్మ తన భర్త కర్రి ప్రసాద్‌కు పూర్వార్జితముగా ఆస్తి సంక్రమించినట్లు చూపించి 64/2028 డాక్యుమెంట్‌లో 15.42 సెంట్లు భూమిని గురజాల ఉప రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 17-06-2018 తేదీన రిజిస్టర్ చేసుకున్నారు. తదనంతరం అదే భూమిని 30-08-2024న ఇంటి పన్ను కావాలంటూ దరఖాస్తు చేశారు. దీనిపై తహసీల్దార్‌ను సర్వే నిమిత్తం సంప్రదించగా ఆ భూమి అసైన్డ్ భూమిగా నిర్ధారించి ఎండార్స్‌మెంట్ జారీ చేశారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిని తమదిగా చూపించి రిజిస్ట్రేషన్ చేయించారని ఇందుకు సంబంధించి పూర్తి పత్రాలతో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్ తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరదకు దెబ్బతిన్న విద్యుత్ మీటర్లు ఉచితంగా మార్పు



మహానాడులో వరద వల్ల దెబ్బతిన్న విద్యుత్ మీటర్



కూలిన ఓ నివాసం వద్ద మీటర్ కోసం వెతుకుతున్న ఉద్యోగి

తాడేపల్లిరూరల్: మహానాడు కృష్ణానది తీరప్రాంతంలో వరద వల్ల దెబ్బతిన్న విద్యుత్ మీటర్లను ఉచితంగా మారుస్తామని విద్యుత్‌శాఖ నులకపేట ఏఈ షణ్ముఖ చెప్పారు. గురువారం మహానాడు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. దెబ్బతిన్న విద్యుత్ మీటర్లను గుర్తిస్తున్నామని వివరించారు. కొన్ని మీటర్లను గుర్తించామని, కూలిన నివాసాల్లో ఉన్న మీటర్ల కోసం వెతుకుతున్నామని చెప్పారు. ఎవరైనా మీటర్ల మార్పు కోసం తమను సంప్రదించొచ్చని వెల్లడించారు.

నిమజ్జనోత్సవాలు



నిమజ్జనం కోసం అమరావతికి తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం



ఫిరంగిపురంలో గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘ యువకులు



దోకిపర్రులో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

ఫిరంగిపురం/మేడికొండూరు: గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరాయి. నిమజ్జనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఫిరంగిపురం శాంతి మెడికల్స్ వద్ద నాయీబ్రాహ్మణ యువ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి గురువారం ఐదోరోజు విశేషపూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో విగ్రహాన్ని ఉంచి గ్రామంలో ఊరేగించి నిమజ్జనానికి అమరావతికి తీసుకువెళ్లారు.

రూ.లక్షా మూడు వేలు పలికిన లడ్డూ ధర

నుదురుపాడులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి పూజలు చేశారు. ఈ సందర్భంగా లడ్డూను వేలంలో రూ.లక్షా మూడువేలకు కొత్తమాసు పూర్ణచంద్రరావు పాడారు. రెండో లడ్డూను ఆలిండియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊరా భాస్కరరావు, లక్ష్మీసుజాత రూ.52 వేలకు పాడారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో విగ్రహాన్ని ఉంచి నిమజ్జనానికి యాదగిరిగుట్టకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఫిరంగిపురంలోని తాళ్లూరు బస్టాండు సమీపంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడి విగ్రహానికి పూజలు చేసి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి నిమజ్జనానికి అమరావతికి తీసుకువెళ్లారు. మేడికొండూరు మండలం దోకిపర్రు గ్రామంలోనూ వినాయక నిమజ్జనోత్సవం ఉత్సాహంగా సాగింది.

పంట నష్టపరిహారం కోరుతూ వినతిపత్రాలు



సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాడేపల్లిరూరల్: వరద, వర్షాల వల్ల దుగ్గిరాల మండలంలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందజేయాలని కోరుతూ గురువారం తుమ్మపూడి, చిలువూరు గ్రామాల్లోని సచివాలయాల కార్యదర్శులకు ప్రజా సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు మాట్లాడుతూ వర్షాల కారణంగా నీట మునిగిన పంటలకు ఎకరాకు 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు అందజేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో సంబంధం లేకుండా ఈ క్రాప్ చేసి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా వ్యవసాయ కార్మికులకు పనులు లేవని, వారికి ఉపాధి కల్పించి, వ్యవసాయ కార్మికులకు కుటుంబానికి 10 వేల రూపాయలు, నిత్యావసర సరుకులు అందజేయాలని, దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగమల్లేశ్వరరావు, చిలువూరు లోకేశ్వరరావు, డి.క్రాంతి కుమార్, ఎం.కోటేశ్వరరావు, ఎం.అంజయ్య, కె.ప్రభాకర్‌రావు, టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



బాలామృతం ప్యాకెట్లను అందజేస్తున్న తాడేపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ భవాని

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం పోషకాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా తాడేపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ బి.జి.భవాని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎక్కువగా పోషకాహారాన్ని తీసుకోవాలని, పాలు, పండ్లు, గుడ్లు, ఆకు కూరలు తీసుకోవడం వల్ల పోషకాలు, విటమిన్లు మనకు లభిస్తాయని వివరించారు. రక్తహీనత ఉన్న వారు ఉసిరి, జామ, బత్తాయి పండ్లను తీసుకోవాలని సూచించారు. తల్లిపాలు ఆరు నెలల వరకు శిశువుకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కుమారి, సుజాత, కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

నుదురుపాడులో..

ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటేశ్వరమ్మ తక్కువ ఖర్చుతో పోషక పదార్థాల తయారీ గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని దీనిద్వారా రక్తహీనత నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద చౌడయ్య, అంగన్‌వాడీలు సునీత, సీతారాఘవ, రాణి, సచివాలయ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలి

పొన్నూరు: సినిమా థియేటర్లలో అందించే తినుబండారాలను నాణ్యతతో అందించాలని, ప్రేక్షకుల నుంచి ఫిర్యాదులు వస్తే తప్పక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు థియేటర్ నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం ఆయన పట్టణంలోని పలు సినిమా హాళ్లు, కూరగాయల మార్కెట్, అన్న క్యాంటీన్‌ను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య వాహనాల్లో మాత్రమే చెత్త వేయాలని, గృహవాసులు, వ్యాపారులు రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యాలను పరిరక్షించుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- తుళ్లూరు జెడ్పీ హైస్కూలులో సైన్స్ సెంటర్ ల్యాబ్ ప్రారంభం
- సమర్థనం ట్రస్ట్ సౌజన్యంతో రూ. 8 లక్షలతో ఏర్పాటు



మినీ సైన్స్ సెంటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సమర్థనం ట్రస్టు, హెర్బలైఫ్ సంస్థ ప్రతినిధులు

తాడికొండ: మినీ సైన్స్ సెంటర్‌ను ఉపయోగించుకొని విద్యార్థులు సైన్స్ సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించాలని సమర్థనం ట్రస్టు, హెర్బలైఫ్ సంస్థ ప్రతినిధులు అన్నారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూలులో గురువారం సమర్థనం ట్రస్ట్ ఫర్ డిజేబుల్డ్ సహకారంతో హెర్బలైఫ్ సంస్థ ప్రతినిధులు రూ. 8 లక్షలతో ఏర్పాటు చేసిన మినీ సైన్స్ సెంటర్ లేబొరేటరీని సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్‌లో మంచి ఫలితాలు రాబట్టాలంటే విద్యార్థులకు ప్రయోగాత్మకమైన నైపుణ్యాలు ఎంతో అవసరమని భావించి, లేబొరేటరీని ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ నైపుణ్యాల్ని పెంచుకొని ఉన్నతంగా ఎదిగి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. హెచ్ఎం గుత్తా శ్రీనివాసరావు సమర్థనం ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 300 మంది బాలికలకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో హెర్బ లైఫ్ సంస్థ ప్రతినిధులు ఉప్పాల రాజేష్, సురేష్ బాబు, రాజశేఖర్, లక్ష్మీనారాయణ, కంచర్ల శ్రీధర్, అనూష, గాయత్రి, భువన మాధవి, సమర్థనం ట్రస్టు ప్రతినిధులు లోకేష్ కుమార్, కొడాలి రంగారావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పెద్దివారిపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి రోజు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని పెద్దివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఎంఈఓ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు భోజనాన్ని అందించి ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

నష్టపోయిన రైతులను, పేదలను ఆదుకోవాలి



గుంటూరు చానల్ వద్ద కేంద్ర బృందానికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెదకాకాని: భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో లక్ష ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వెంటనే రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కేంద్ర బృందాన్ని కోరారు. గుంటూరు జిల్లాలో వరద నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందానికి పెదకాకాని మండలంలోని గుంటూరు చానల్ వద్ద సీపీఎం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో వరి, పత్తి, మిర్చి, కంద, అరటి, పసుపు, నిమ్మ, తమలపాకులు, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఉద్యాన పంటలకు కౌలుతో సహ ఇప్పటికే రూ.2లక్షలు, వరికి రూ.70వేలు ఖర్చు చేశారన్నారు. పంటలన్నీ నీట మునిగి సర్వం కోల్పోయి, రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వ్యాపార పంటలకు ఎకరాకు రూ.లక్ష, వరికి రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌పరిధిలో జరిగింది. సీఐ వంశీధర్ కథనం ప్రకారం వెంగళాయపాలెంకు చెందిన దుద్దుల పాపయ్య (45) నగరంపాలెం వద్ద ఇస్త్రీ పనిచేస్తూ ఉంటాడు. బుధవారం రాత్రి పనిముగిసిన అనంతరం ఇంటికి వెళుతూ హౌసింగ్‌బోర్డ్ కాలనీవ వద్ద మద్యం తీసుకుని సమీపంలోని పొలాల్లో మద్యం సేవించేందుకు వెళ్లాడు. అక్కడ మద్యం తాగుతుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. ఆ మంటలను ఆర్పుకున్న అతను రుద్ర ట్రస్ట్ సహకారంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు వచ్చాడు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.